

నామమాత్రంగా..



కార్పొరేషన్‌లో ఆస్తి పన్నుల రీ అసెస్‌మెంట్

- తక్కువ పన్నులు చెల్లిస్తున్నా పట్టించుకోని వైనం
- తాజా రీ అసెస్‌మెంట్‌తో వెలుగు చూస్తున్న లోపాలు
- రూ. కోట్లలో బల్దియా ఆదాయానికి గండి

కరీంనగర్ టౌన్, జూలై 4: నగరపాలక సంస్థ ఆదాయంలో ఆస్తిపన్నులే కీలకం. ఆస్తి పన్నులను సక్రమంగా వసూలు చేస్తే ప్రతి యేడాది ఆదాయం పెరుగుతుంది. ఆన్‌లైన్ ద్వారా ఆస్తిపన్నులను నిర్ధారిస్తుండడంతో కొంత మేరకు లోపాలు తగ్గినప్పటికి ప్రతి యేటా రీ అసెస్‌మెంట్ సరిగా చేయక పోవడంతో బల్దియా ఖజానాకు కోట్లలో గండి పడుతోంది. పదేళ్లుగా శరవేగంగా విసరిస్తున్న కరీంనగర్‌లో ఎటు చూసినా పెద్దపెద్ద భవనాలు, అపార్టుమెంట్లు, వాణిజ్య సముదాయాలు దర్శనమిస్తున్నప్పటికీ ఆ మేరకు వాటి ద్వారా ఆస్తిపన్నులు వసూలు కావడం లేదనే విమర్శలున్నాయి.

నగరపాలక సంస్థ పరిధిలో అధికారిక లెక్కల ప్రకారంగా 82,732 నివాస, వాణిజ్య గృహాలు, గృహ సముదాయాలున్నాయి. ఇవి కాకుండా అసెస్‌మెంట్ కానీ భవనాలు, ఇళ్లు ఉన్నాయి. పాత ఇళ్లను కూల్చి వేసి కొత్తగా బహుళ అంతస్తు భవనాలను నిర్మించుకుని పాత ఇంటి పన్నులను చెల్లించేవారు ఎంతో మంది ఉన్నారు. నగరపాలక సంస్థకు ఆస్తిపన్నుల ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 31 కోట్ల రూపాయల ఆదాయం వస్తుందని అంచనా వేశారు. గత బకాయిలతో కలిపి మరో కోటి వరకు రావచ్చు. అదనపు ఆదాయ వనరులపై దృష్టిసారించాలని, ప్రతి యేటా రీ అసెస్‌మెంట్‌ను సక్రమంగా చేపట్టి పన్నుల ద్వారా ఆదాయం పెంచుకోవాలని ప్రభుత్వం, ఉన్నతాధికారులు సూచిస్తుండడంతో నామ మాత్రంగా కొన్ని ఇళ్లను రీ అసెస్‌మెంట్ చేసి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

హౌసింగ్ బోర్డులోనే రూ. కోటికిపైగా పెరిగిన ఆస్తిపన్ను

ఇటీవల స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్ నగరపాలక సంస్థ పై ప్రత్యేక దృష్టిసారించి అదనపు ఆదాయ వనరుల్లో ప్రధానమైన ఆస్తిపన్నులను రీ అసెస్‌మెంట్ చేయాలని ఆదేశించారు. ఏప్రిల్ నుంచి నగరంలోని పలు ప్రాంతాల్లో బిల్ కలెక్టర్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగితో కలిసి వెళ్లి వారి దృష్టికి వచ్చిన ఇళ్లు వాణిజ్య భవనాలను కొలతలు తీసుకొని రీ అసెస్‌మెంట్ చేస్తున్నారు. హౌసింగ్‌బోర్డుకాలనీలోనే రీ అసెస్‌మెంట్‌తో కోటి రూపాయలకు పైగా ఆస్తి పన్ను పెరిగింది. దశాబ్దాల క్రితం ఆనాటి ప్రభుత్వం హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా హెచ్‌ఐజీ, ఎంఐజీ, ఎల్‌ఐజీ-2 కేటగిరీలుగా వెయ్యికి పైగా ఇళ్లతో హౌసింగ్ బోర్డుకాలనీని ఏర్పాటు చేసింది. ఆ కాలనీలో సరైన మౌలిక వసతులు లేక పోవడంతో అభివృద్ధికి నోచుకోలేదు.

స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో హౌసింగ్‌బోర్డుకాలనీని మోడల్ కాలనీగా ఎంపిక చేసి అభివృద్ధి చేశారు. దీంతో గతంలో నిర్మించిన ఇళ్లను కూల్చివేసుకొని వాటి స్థానంలో కొత్త ఇళ్లను, బహుళ అంతస్తు భవనాలను, వాణిజ్య భవనాలను నిర్మించుకున్నారు. కొంత మంది ఇంటి యజమానులు మినహా మిగతా వారందరూ పాత ఇంటి నంబర్‌తో అప్పటి ఆస్తిపన్నులనే చెల్లిస్తూ వస్తున్నారు.

రీ అసెస్‌మెంట్ చేసి కొత్తగా నిర్మించిన ఇంటి పరిమాణాన్ని బట్టి పన్నులను నిర్ధారించక పోవడంతో బల్దియా ఆదాయం కోల్పోయింది. ప్రస్తుతం చేపడుతున్న రీ అసెస్‌మెంట్‌లో ప్రతి ఇంటిని అనుమతి ప్రకారం పరిశీలిస్తూ కొలతలు తీసుకొని ఆస్తిపన్నులను నిర్ధారించడంతో కోటికిపైగా అదనంగా ఆదాయం వచ్చింది. ఇలాగే నగరంలోని అనేక ప్రాంతాల్లో పాత ఇళ్లను కూల్చివేసి కొత్త ఇళ్ళను నిర్మించుకొని పాత పన్నులనే చెల్లిస్తున్నారు. కొందరైతే నివాస గృహాలుగా పన్నులు చెల్లిస్తూ వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నారు. మరి కొందరు బహుళ అంతస్తు భవనాలను నిర్మించుకుని ఒకటి రెండు ఫ్లోర్‌లకే పన్నులు చెల్లిస్తున్నారు. దీంతో నగరపాలక సంస్థ భారీగా ఆదాయం కోల్పోతోంది.

హౌసింగ్‌బోర్డు కాలనీతో పాటు మరికొన్ని ప్రాంతాల్లోనూ రీ అసెస్‌మెంట్ చేయడంతో 2.2 కోట్ల రూపాయల మేరకు ఆస్తి పన్నులు పెరిగాయి. రీ అసెస్‌మెట్ పూర్తి చేస్తే మరో కోటి రూపాయల వరకు పెరగవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. విలీన డివిజన్లు, కొత్తగా ఏర్పడుతున్న శివారు కాలనీలతోపాటు వాణిజ్య ప్రాంతాల్లోనూ ఇలా నగరంలోని ప్రతి ఇంటిని రీఅసెస్‌మెంట్ చేస్తే ప్రస్తుతం వసూలవుతున్న ఆస్తిపన్నులు రెట్టింపు అవుతుందని, దాదాపు ఏడాది 50 కోట్లకు పైగానే ఆస్తిపన్ను వస్తుందని చెబుతున్నారు. ఆన్‌లైన్ ద్వారా ఆస్తిపన్నులు చెల్లిస్తుండడంతో క్షేత్రస్థాయిలో ఏమైనా ఫిర్యాదులు వస్తే తప్ప రీ అసెస్‌మెంట్ అనేది సరిగా చేయడం లేదు.

కేంద్ర మంత్రి గడ్కరీతో బండి సంజయ్ భేటీ



గడ్కరీకి వెంకటేశ్వర స్వామి జ్ఞాపికను అందిస్తున్న బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, జూలై 4: కేంద్ర రహదారులు, రవాణా శాఖమంత్రి నితిన్ గడ్కరితో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ గురువారం ఢిల్లీలో భేటీ అయ్యారు. తెలంగాణలోని జాతీయ రహదారుల విస్తరణతోపాటు, కరీంనగర్ పార్లమెంట్ నియోజక వర్గంలో పురోగతిలో ఉన్న జాతీయ రహదారుల నిర్మాణ పనులు, కొత్త రహదారుల నిర్మాణ ప్రతిపాదనలపై చర్చించారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని మండలాల్లో రోడ్ల విస్తరణకు సంబంధించి కేంద్ర రహదారుల మౌలిక సదుపాయాల నిధి (సీఆర్ఐఎఫ్) కింద నిధులు విడుదల చేయాలని కోరారు.

హుజూరాబాద్ ఏరియా ఆసుపత్రికి ఎన్‌క్వాస్ అవార్డు



వైద్యాధికారులను అభినందిస్తున్న కలెక్టర్ పమేలాసత్పతి

సుభాష్‌నగర్/హుజూరాబాద్, జూలై 4: హుజూరాబాద్ ఏరియా ఆసుపత్రి నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్ (ఎన్‌క్వాస్) అవార్డుకు ఎంపికైంది. మూడు రోజుల క్రితం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో అధికారులు అవార్డును అందుకున్నారు. ఈ మేరకు గురువారం డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాతతోపాటు వైద్యాధికారులు కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతి వారిని అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నాణ్యమైన వైద్యం, పరీక్షలు, సానిటేషన్, అడ్మినిస్ట్రేషన్, ఇన్‌ఫెక్షన్ కంట్రోల్‌లో 95 శాతం పాయింట్లు సాధించి అవార్డుకు హుజూరాబాద్ ఆసుపత్రి ఎంపిక కావడం అభినందనీయమన్నారు. జాతీయ స్థాయిలో మూడో స్థానంలో నిలవడం జిల్లాకు గర్వకారణమన్నారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ కృష్ణప్రసాద్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజేందర్‌రెడ్డి, ఆర్ఎంవో డాక్టర్ సుధాకర్‌రావు పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్య త్యాగం చిరస్మరణీయం

కలెక్టర్ పమేలా సత్పతి



దొడ్డి కొమురయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, అధికారులు

కరీంనగర్ టౌన్, జూలై 4: తెలంగాణ స్వయం పాలన ఆకాంక్షలకు ఊపిరిలూదిన సాయుధ కాలపు తొలి అమరుడు దొడ్డి కొమురయ్య త్యాగం చిరస్మరణీయమని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య 78వ వర్ధంతిని పురస్కరించుకొని కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్లో ఆయన చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి గురువారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో దొడ్డి కొమురయ్య కీలక పాత్ర పోషించారన్నారు. ఆయన పోరాట స్ఫూర్తి తరతరాలుగా గుర్తుండిపోతుందన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కడివెండి గ్రామంలో జన్మించిన కొమురయ్య ఒక మహోన్నత ఉద్యమానికి ఆద్యుడయారన్నారు. అనంతరం కురుమ, బీసీ సంఘాల నాయకులు దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డీఆర్వో పవన్ కుమార్, బీసీడీవో అనిల్ ప్రకాష్, అసిస్టెంట్ బీసీడీవో రాజమనోహర్‌రావు, కురుమ, బీసీ సంఘాల ప్రతినిధులు మీస బీరయ్య, కర్రె పావని, కడారి ఐలయ్య, జక్కని సంజయ్ కుమార్, గుంటి స్వరూప, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కొలువుదీరిన ప్రత్యేకాధికారులు





- 15 మంది జిల్లా అధికారులకు ప్రత్యేక బాధ్యతలు
- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్

కరీంనగర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మండల ప్రజాపరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్ష, సభ్యుల పదవీ కాలం ముగియడంతో ప్రత్యేకాధికారులు మండల ప్రజాపరిషత్‌లలో బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం కలెక్టర్ పమేలా సత్పతి 15 మండలాలకు 15 మంది జిల్లాస్థాయి అధికారులను మండల ప్రజాపరిషత్‌లకు ప్రత్యేకాధికారులుగా నియమిస్తూ వెంటనే బాధ్యతలను స్వీకరించాలని ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో గుప్రత్యేకాధి కారులు మండల ప్రజా పరిషత్ కార్యాలయాలకు వెళ్లి బాధ్యతలను స్వీకరించి, రికార్డులను స్వాధీనం చేసుకున్నారు.

చిగురుమామిడి మండలానికి జిల్లా వెటర్నరీ, పశు సంవర్థక శాఖ అధికారి డాక్టర్ నరేందర్‌ను ప్రత్యేకాధికారిగా నియమిం చారు. చొప్పదండి మండలానికి వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ ఎం జయశంకర్, ఇల్లందకుంటకు జిల్లా హార్టికల్చర్, సెరికల్చర్ ఆఫీసర్ బి శ్రీనివాస్, గంగాధర మండలానికి జడ్పీ సీఈవో శ్రీనివాస్, గన్నేరువరం మండలానికి జిల్లా సహకార అధికారి ఎస్ రామాంజనేయచారి, హుజూరాబాద్‌కు ఆర్డీవో ఎస్ రమేశ్‌బాబు, జమ్మికుంట మం డలానికి జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ జి నవీన్‌కుమార్‌ను ప్రత్యేకాధికారిగా నియమించారు. కరీంనగర్ రూరల్ మండలానికి ఆర్డీవో కె మహేశ్వర్, కొత్తపల్లి మండలానికి మైన్స్ ఏడీ ఎన్ రామాచారి, మానకొండూర్ మండలానికి డీఆర్డీవో వి శ్రీధర్, రామడుగు మండలానికి జిల్లా బీసీ అభివృద్ధి అధికారి ఎస్ అనిల్‌ప్రకాష్‌కిరణ్, సైదాపూర్ మండలానికి జిల్లా వ్యవసాయ అధికారి బి శ్రీనివాస్, శంకరపట్నం మండలానికి ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎస్ నాగార్జున, తిమ్మాపూర్ మండలానికి జిల్లా పంచాయతీ అధికారి ఎ.రవీందర్, వీణవంక మండలానికి సీపీవో కొమురయ్యకు ప్రత్యేకాధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రత్యేకాధికారులంతా బాధ్యతలను స్వీకరించి, సంబంధిత ఉద్యోగులతో సమావేశాలను నిర్వహించారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం

నగరంలో విద్యార్థి నాయకుల బైక్‌ర్యాలీ



బైక్ ర్యాలీలో పాల్గొన్న విద్యార్థి, యువజన సంఘాలు

భగత్‌నగర్, జూలై 4: కరీంనగర్‌లో విద్యార్థి, యువజన సంఘాల ఐక్య కార్యాచరణ సమతి ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యా సంస్థల బంద్ గురువారం విజయవంతమైంది. విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించి ప్రభుత్వ విద్యాసంస్థలను బంద్ చేయించారు. ప్రైవేట్ విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి, యువజన సంఘాల నాయకులు మాట్లాడుతూ నీట్ మళ్లీ నిర్వహించాలని, పేపర్ లీకేజీలకు కారణమైన ఎన్టీఏను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నీట్ సమస్యపై సీబీఐ దర్యాప్తు సరి గా జరగడంలేదన్నారు. 24 లక్షల మంది విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనిగరపు రజనీకాంత్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రాణాప్రతాప్ కుమార్, ఎన్ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడు రాంప్రసాద్, ఏఐవైఎఫ్ జిల్లా క్యాదర్శి బ్రాహ్మణపల్లి యుగేందర్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తిరుపతి నాయక్, ఏఐఎఫ్‌డీఈఎస్ జిల్లా కన్వీనర్ శ్రీకాంత్, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్లు మచ్చ రమేష్, గజ్జెల శ్రీకాంత్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బోనగిరి మహేందర్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అరవింద్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యనిర్వహక కార్యదర్శి మామిడిపల్లి హేమంత్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రోహిత్, వినయ్, సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆషాఢం


కరీంనగర్ కల్చరల్, జూలై 4: ఆషాఢ మాసం (శూన్య మాసం) శనివారంతో ప్రారంభమై ఆగస్టు 4వ తేదీ వరకు కొనసాగనుంది. వర్ష ఋతువు, దక్షిణాయనం ఈ మాసంలోనే ప్రారంభమవుతాయి. శుభకార్యాలను వాయిదా వేసే మాసమైనా కాస్త వైశిష్ట్యాన్ని సంతరించుకుంది. ఈ మాసంలో 7న పూరీ జగన్నాథ రథయాత్ర, శుక్ర మూఢం విముక్తి, 11న స్కంద పంచమి, 12న సుబ్రహ్మణ్యషష్టి, 13న భాను సప్తమి, 16న దక్షిణా యనం ప్రారంభం, 17న తొలి ఏకాదశి, చాతుర్మాస్య వ్రత ప్రారంభం 21న గురుపౌర్ణమి (వ్యాస పూర్ణిమ), సికింద్రాబాద్ మహంకాళి బోనాల జాతర, 29న గ్రామ, కుల దేవతల బోనాల జాతరలు ఉంటాయి.

● ఆగస్టు 8 నుంచి శుభ ముహూర్తాలు...

ఏప్రిల్ 28 వరకు మంచి రోజులుండగా మే, జూన్ నెలల్లో వచ్చిన గురు, శుక్ర మూఢాలు, కర్తరి, నర్మదానదీ పుష్కరాలతో రెండు నెలలుగా ముహూర్తాలకు బ్రేక్ పడింది. తాజాతా ఆషాఢమాసంతో మరో నెల ముహూర్తాలకు కరువు ఏర్పడింది. దీంతో సుమారు మూడు నెలల పాటు ముహూర్తాలు లేవు. శ్రావణ మాసం ఆగస్టు 5న ప్రారంభం అవుతుంది. 8 నుంచి 28వ తేదీ వరకు శుభముహూర్తాలు ఉన్నాయి.

అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్, జూలై 4: కరీంనగర్ ఎస్సారార్ ఆర్ట్స్, సైన్స్ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపకుల పోస్టులకు అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ కె రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లీష్ 3, తెలుగు 3, బిజినెస్ ఎనలిటిక్స్ 1, కామర్స్, బీసీఏ, కంప్యూటరు సైన్స్, అప్లికేషన్స్ 5, బీబీఏ 3, డాటా సైన్స్ 1, స్టాటిస్టిక్స్ 1, క్రాప్ ప్రొడక్షన్ 1, ఫిషరీస్‌లో ఒక ఖాళీ ఉందని చెప్పారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో కనీసం 55 శాతం మార్కులుండి, నెట్, సెట్, పీహెచ్‌డీ చేసి టీచింగ్‌లో అనుభవం ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి ఉన్న వారు కళాశాలలో ఈ నెల 6న ఉదయం 10 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో పాటు ఒక జిరాక్స్ సెట్‌తో ఇంటర్వ్యూకు హాజరు కావాలని తెలిపారు. గతంలో కళాశాలలో పనిచేసిన వారికి ప్రాధాన్యం ఉంటుందని, హైకోర్టు తీర్పు, కమిషనర్ ఉత్తర్వుల మేరకు నియామకాలు జరుగుతాయని తెలిపారు.



ఈ సీజన్ ప్రారంభంలో మురిపించిన వర్షాలు తరువాత జాడలేకుండా పోయాయి. అడపాదడపా కురిసిన వర్షాలకు రైతులు పత్తి విత్తనాలు వేసుకున్నారు. అవి సరిగా మొలకెత్తక ఇబ్బందులు పడ్డారు. వరినార్లు ఆలస్యమయ్యాయి. సాధారణంగా ఈ సమయానికి 50 శాతానికి మించి నాట్లు పూర్తయ్యేవి. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 20 శాతం కూడా నాట్లు పడలేదు. నీటి వసతి ఉన్న కొద్దిపాటి ప్రాంతాల్లో మాత్రమే నాట్లు వేశారు. మరికొన్ని ప్రాంతాల్లో ఇప్పుడిప్పుడే నారు పోస్తున్నారు.



గంగాధరలో నారుమడి

వానాకాలం సాగు ఆలస్యం

- కొన్నిచోట్ల ఇప్పుడిప్పుడే ప్రారంభమైన వరినాట్లు...
- మరికొన్ని ప్రాంతాల్లో నారుపోస్తున్న రైతులు

హుజూరాబాద్, జూలై 4: వానకాలం వరినాట్లు వారం రోజుల నుంచి ఎస్సారెస్పీ ఆయకట్టు కింద రైతులు ఇప్పుడిప్పుడే ప్రారంభించారు. హుజూరాబాద్ డివిజన్‌లోని ఎస్సారెస్పీ ఆయకట్టు కింద జూన్ రెండో వారంలో నారుమళ్లు పోయగా, వర్షాలు పడలేదు. దీంతో బావుల్లో ఉన్న నీటితో నాట్లు వేశారు. ఆయకట్టు కింద ఇప్పటి వరకు 20 శాతం మాత్రమే వరినాట్లు పూర్తయ్యాయి. మెట్ట ప్రాంత రైతులు వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. 15 రోజుల క్రితమే బీహార్, మధ్యప్రదేశ్, ఒడిస్సా, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల నుంచి నాట్లు వేసేందుకు వ్యవసాయ కూలీలు గ్రామాలకు వచ్చారు. వారికి పని దొరకక ఇబ్బంది పడుతున్నారు. పత్తి పంట వేసిన రైతులు కలుపు మొక్కలు తొలగిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సన్నరకం వరికి క్వింటాల్‌కు 500 రూపాయల బోనస్ ఇస్తామని ప్రకటించింది. దీంతో డివిజన్‌లో ఈసారి గతంలో కంటే సన్నరకాల సాగు పెరగనుంది. దొడ్డు రకం సాగు చేసే రైతులు ఇప్పుడిప్పుడే వరినార్లు పోస్తున్నారు. ఈ నెలలో వర్షాలు కురిస్తేనే పంటలు సమృద్ధిగా పండే అవకాశం ఉంది.



హుజూరాబాద్‌లో నాట్లు వేస్తున్న మహిళలు

● ***గంగాధర:*** ఎన్నో ఆశలతో వానాకాలం సాగుకు సిద్ధమైన రైతులకు ఆశించిన స్థాయిలో వర్షాలు కురవక పోవడంతో ఆలస్యంగా నార్లు పోస్తున్నారు. గంగాధర మండలంలోని గర్శకుర్తి, ఉప్పర మల్యాల, రంగరావుపల్లి, కురిక్యాల, మల్లాపూర్, గోపాల్‌రావుపల్లి, వెంకంపల్లి గ్రామాల్లో ఎక్కువగా పత్తి సాగు చేస్తారు. మిగతా గ్రామాల్లో వరద కాలువతో పాటు నారాయణపూర్ ఎడమ కాలువ కింద వరి సాగు చేస్తారు. ఈ సారి వర్షాలు కురవకపోవడంతో బావుల్లోకి, చెరువుల్లోకి నీరు చేరలేదు. ఈ వారంతో ఆరుద్ర కార్తె ముగుస్తుంది. కార్తె చివరన రైతులు ఆలస్యంగా నార్లు పోస్తున్నారు. మరో వారం పదిరోజుల్లో నాట్లు ప్రారంభమవుతాయి. వర్షాలు లేక బావులు, బోర్ల కింద సాగు చేసే రైతులు రెండు రోజులకో మడిని తడుపుతూ నాట్లకు సిద్ధం చేస్తున్నారు. వర్షాలు ఈ సారి పంటల సాగు కష్టమవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మానసిక వికలాంగుల పాఠశాలకు నిధులు ఇవ్వండి

● సీఎంను కలిసిన పాఠశాల ట్రస్టు ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి

తిమ్మాపూర్, జూలై4: మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల జిల్లా స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మానసిక వికలాంగుల పాఠశాలకు ప్రభుత్వం నుంచి నిధులు ఇవ్వాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పాఠశాల ట్రస్టు ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి హైదారాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ పాఠశాలకు ప్రభుత్వ పక్షాన ప్రతి నెల 8లక్షల 30వేల నిధులు మంజూరు ఇప్పించాలని సీఎంను కోరారు. 2021లో గత ప్రభుత్వంలో పూర్తి స్థాయిలో నిధులు మంజూరు చేస్తామని చెప్పి మాట నిలుపుకోలేదని, కేంద్ర ప్రభుత్వం సంవత్సరానికి 52లక్షలకు ప్రతిపాదనలు పంపిస్తే కేవలం 16లక్షలు మాత్రమే విడుదల చేసిందని సిఎం దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. పాఠశాల సిబ్బంది జీతభత్యాలకు, హస్టల్ నిర్వహణకు డబ్బు లేకపోవడంతో సంక్లిష్ట పరిస్థితులలో పాఠశాల నడుస్తున్నదని పాఠశాల నిర్వహణకు ప్రతి నెల 8లక్షల 30వేల రూపాయలు ఖర్చు అవుతుందని తెలిపారు. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం మానసిక వికాలంగుల పాఠశాలపై ప్రత్యేక దృష్టి పెట్టి సంవత్సరానికి కోటి రూపాయల ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విన్నవించినట్లు ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి కూడా దానికి సానుకులంగా స్పందించినట్లు తెలిపారు.


సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన చాడ వెంకట్‌రెడ్డి

ప్రమాదవశాత్తూ యువకులకు గాయాలు

సైదాపూర్, జూలై 4: సైదాపూర్ మండలంలోని రాయికల్ వాటర్‌ఫాల్స్ వీక్షించేందుకు వచ్చిన ఇద్దరు యువకులు ప్రమాదవశాత్తూ గాయాలపాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన సంపత్, మన్నెంపల్లికి చెందిన శ్రీనివాస్ అనే యువకులు రాయికల్ వాటర్‌ఫాల్స్ అందాలు చూసేందుకు గురువారం వచ్చారు. వాటర్ ఫాల్స్ వద్ద తేనటీగలు వారిపై దాడి చేశాయి. దాంతో ఆ యువకులు తేనెటీగల నుంచి తప్పించుకునేందుకు పరుగులు తీయగా జారిపడడంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు, స్థానికులు ఆ యువకులను 108 వహనంలో ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

సుల్తానాబాద్, జూలై 4: మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన ఎలవేణి మల్లయ్య(54) చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. కుటుంబ తగాదాల కారణంగా జీవితంపై విరక్తి చెంది బుధవారం సాయంత్రం పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా గురువారం సాయంత్రం మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులు లేని పాఠశాలలో ఆరుగురు ఉపాధ్యాయులు

● పాఠశాలను సందర్శించిన జడ్పీటీసీ కుమార్

చందుర్తి, జులై 4 : రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు కృషి చేస్తుండగా మండలంలోని కిష్టంపేట గ్రామంలో ఇందుకు విరుద్ధంగా విద్యా వ్యవస్థ కొనసాగుతుందని జడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్ అన్నారు. మండలంలోని కిష్టంపేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఉదయం జడ్పీటీసీ సభ్యుడు కుమార్ సందర్శించారు. పాఠశాలను సందర్శించిన సమయంలో విద్యార్థుల సంఖ్య జీరో ఉండగా, ఆరుగురు ఉపాధ్యాయులకుగాను ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే హాజరయ్యారు. విద్యార్థులు లేకపోవడంతో వంతుల వారీగా ఉపాధ్యాయులు విధులకు హాజరవుతున్నట్లు ఆయన దృష్టికి వచ్చింది. ప్రధానోపాధ్యాయునితో పాటు మరో ముగ్గురు ఉపాధ్యాయులు విధులకు డుమ్మా కొట్టడంతో జడ్పీటీసీ అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థులు లేకపోవడంతో ప్రతిరోజు ఉపాధ్యాయులు పాఠశాలలో కాలక్షేపం చేస్తున్నట్లు తనిఖీలో వెల్లడయింది. కొన్ని పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఎక్కువ ఉండగా ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్న పరిస్థితులు ఉన్నాయి. కిష్టంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను చూస్తే ఉపాధ్యాయ పనితీరు ఏ విధంగా ఉందో అర్థమవుతుందని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు లేని పాఠశాలకు ఉపాధ్యాయులను కేటాయించడంతో లక్షలాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం అవుతోందని, ఉపాధ్యాయులను ఇతర పాఠశాలకు డిప్యూటేషన్‌పై పంపాలని జడ్పిటిసి సభ్యుడు కుమార్ జిల్లా విద్యాధికారికి ఫోన్‌లో మాట్లాడి కోరారు.


పాఠశాల పరిస్థితిపై డీఈవో ఫోన్‌లో మాట్లాడుతున్న జడ్పీటీసీ

బొగ్గు బ్లాకుల వేలాన్ని నిలిపివేయాలి


కరపత్రం విడుదల చేస్తున్న ట్రేడ్‌యూనియన్ నాయకులు

భగత్‌నగర్, జూలై 4: సింగరేణి బ్లాకుల వేలాన్ని నిలిపివేయాలని కోరుతూ శుక్రవారం కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆల్ ట్రేడ్‌యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఆల్‌ట్రేడ్ యూనియన్ నాయకుల సమావేశం నిర్వహించి, కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి, సిఐటియు, ఐఎఫ్‌టియు, టిఎన్‌టియుసి నాయకులు టేకుమల్ల సమ్మయ్య, ఎడ్ల రమేష్, జిందం ప్రసాద్, కళ్యాడపు ఆగయ్య, కె బుచ్చయ్య యాదవ్, లక్ష్మణ్, కూరపాటి రమేష్, ముకుందరెడ్డి, యు శ్రీనివాస్, ప్రభ, స్వర్ణలత, తదితరులు పాల్గొన్నారు.

● భగత్‌నగర్ : బీజేపీ ప్రభుత్వం బొగ్గు బ్లాకుల వేలాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్‌కుమార్ డిమాండ్ చేశారు. ప్రైవేట్ సంస్థలకు మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాకులను వేలం వేస్తున్నదని, సింగరేణి సంస్థను ప్రైవేట్‌సంస్థలతో వేలం పాటలో పోటి పడాలని నిర్ణయించడం సిగ్గుచేటన్నారు. దేశభక్తి పేరుతో దేశసంపదను ప్రైవేట్ పరం చేస్తున్న బీజేపీవిధానాలను ప్రజానీకం గుర్తించి తగిన బుద్ధి చెప్పాలన్నారు.

పోలీసుల అదుపులో గంజాయి విక్రేత?

చందుర్తి, జూలై 4 : చందుర్తి మండలం మూడపల్లి గ్రామానికి చెందిన ఓ యువకుడిని గంజాయి విక్రయిస్తున్నాడని పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అరుణ్ అనే యువకుడు హైదరాబాద్‌లో రూమ్‌మేట్ వద్ద నుంచి గంజాయి తీసుకువచ్చి గ్రామంలో విక్రయిస్తున్నాడన్న అనుమానంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు.

గురుకుల పనివేళలను సమీక్షించాలి

జగిత్యాల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): గురుకుల విద్యా సంస్థలకు నిర్ణయించిన పనివేళల్లో శాస్త్రీయత లోపించిందని, విద్యార్థులుకుపై మానసిక ఒత్తిని పెంచే విదంగా ఉందని, వాటిని వెంటనే పునః సమీక్షించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తిరుక్కోవెల శ్యామ్‌సుందర్, అంబటి భూమేశ్వర్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడారు. గత ప్రభుత్వం లెక్కకు మిక్కిలి గురుకులాలను ప్రారంభించి అరకొర సౌకర్యాలున్న అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న సందర్భంలో ప్రస్తుత పనివేళలు సమర్థనీయంగా లేవన్నారు. విద్యార్థులు మూడు గంటల పాటు ఏకబిగిన అసౌకర్యమైన తరగతి గదుల్లో కూర్చోవటం, ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 1.45 వరకు భోజనం చేయకుండా ఉండడం ఎలా సాధ్యమవుతుందో అర్థం కావడం లేదన్నారు. ఉపాధ్యాయులకు స్టాఫ్‌క్వార్టర్స్ లేకుండా ఊరికి దూరంగా విద్యా సంస్థలు ఉన్న సందర్భంలో ఉదయం పాఠశాలకు వెళ్లిన ఉపాధ్యాయులు రాత్రి 9 గంటల వరకు అక్కడే ఉండాల్సిన దుస్థితి నెలకొంటుందన్నారు. ప్రభుత్వ సెలవులు, పండుగ సెలవుల్లో కూడా పనిచేయాల్సిన సందర్భంలో ఉపాధ్యాయులు తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతారని ఆందోళన వ్యక్తం చేశారు.

బ్యాటరీల దొంగను పట్టుకున్న స్థానికులు

ఎల్లారెడ్డిపేట, జూలై 4: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి బస్టాండులోని కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారిపై వాహనాల బ్యాటరీల దొంగను స్థానికులు గురువారం పట్టుకున్నారు. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. గొల్లపల్లిలో కొంత కాలంగా ఆరుబయట నిలిపి ఉంచిన ఆటోలు, బైకులు, ట్రాలీ ఆటోలు, ట్రాక్టర్లకు సంబంధించిన బ్యాటరీలు చోరీకి గురవుతున్నాయి. గురువారం గొల్లపల్లి బస్టాండ్ ప్రాంతంలో నిలిపి ఉన్న ట్రాలీ ఆటో బ్యాటరీని చోరీ చేస్తుండగా స్థానికులు గమనించి పట్టుకున్నారు. అదే వాహనంలో చోరీకి పాల్పడిన వ్యక్తిని తాళ్లతో చేతులను కట్టేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. ఆరుగురు ఓ ముఠాగా ఏర్పడి బ్యాటరీలతో పాటు ద్విచక్ర వాహనాలను దొంగలిస్తున్నారని గుర్తించారు. ముఠాలో ఇద్దరు మహిళలున్నారని తేలింది.

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న వరద


శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

- ప్రాజెక్టులోకి 2,894 క్యూసెక్కుల నీరు

జగిత్యాల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. గురువారం వరద నీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్‌ఆర్‌ఎస్‌పీ ప్రాజెక్టులోకి 2,894 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వాటర్ వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 90.323 సామర్థ్యంకు గానూ ప్రస్తుతం 11.335 టీఎంసీల నీరు నిల్వఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 16.126 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ అవసరాలకు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 479 క్యూసెక్కుల నీటిని వదిలారు. ఇదిలా ఉండగా జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 5.190 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

జైనాలో వైభవంగా పోచమ్మ బోనాలు

ధర్మపురి, జూలై 4: ధర్మపురి మండలంలోని జైనా గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాల వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు నెత్తి మీద బోనాలు పెట్టుకుని డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా సమీపంలో గల ఆలయానికి వెళ్లారు. అనంతరం మహిళలు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. మహిళలు అమ్మవారలకు పసుపు, కుంకుమ చల్లి, బోనాలు పెట్టి నైవేద్యం సమర్పించారు. కుటుంబసభ్యులు క్షేమంగా ఉండాలని, పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో జైనా రజక సంఘం అధ్యక్షులు సంగెపు గంగారం, గౌరవ అధ్యక్షులు సంగెపు మల్లయ్య, సభ్యులు లచ్చయ్య, వెంకటి, గంగారాం, బుచ్చయ్య, మల్లయ్య, శ్రీనివాస్, ప్రదీప్, అజయ్, సతీష్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.


జైనా రజక సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు

విద్యుత్‌చౌర్యం కేసులో ఒకరికి జైలుశిక్ష

కరీంనగర్ క్రైం, జూలై 4 : ఎలాంటి అనుమతి లేకుండా విద్యుత్‌ను చౌర్యం చేసిన కేసులో హుజురాబాద్ మండలం బోర్నపల్లికి చెందిన కేశబోయిన తిరుపతికి ఒక నెల రోజుల సాధారణ జైలు శిక్ష లేదా 14,616 రూపాయల జరిమాననాను విధిస్తూ కరీంనగర్ జిల్లా 1వ అదనపు సెషన్స్ జడ్జి డి వెంకటేష్ గురువారం తీర్పు ఇచ్చారని కరీంనగర్ ట్రాన్స్‌కో విజిలెన్స్ సీఐ ఎండీ షాదుల్లా బాబా తెలిపారు. ఈ సమావేశంలో ట్రాన్స్‌కో విజిలెన్స్ హెడ్‌కానిస్టేబుల్ ఇంతియాజ్ మహ్మద్‌ఖాన్, బి రాజయ్యలున్నారు.

రూ.7,500 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, జూలై 4: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,500 పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు తొమ్మిది మంది రైతులు 181క్వింటాళ్ల విడి పత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7500, కనిష్ఠ ధర రూ.7200 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

గంజాయి ముఠా గుట్టు రట్టు చేసిన పోలీసులు

● 2 కిలోల 70 గ్రాముల గంజాయి పట్టివేత
● వివరాలు వెల్లడించిన డీఎస్పీ రఘుచందర్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రఘుచందర్

ధర్మపురి, జూలై 4: జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణ శివారులో గల హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద గంజాయి విక్రయించేందుకు వెళ్తున్న బత్తిని చందు (23), గోల్ల వెంకటేష్ (25) పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశానుసారంగా ధర్మపురి పోలీస్ సర్కిల్ కార్యాలయంలో జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల అరెస్ట్ వివరాలు వెల్లడించారు. ధర్మపురి మండలంలోని రాయపట్నం గ్రామానికి చెందిన నిందితులు చందు, వెంకటేష్ గంజాయి తాగుటకు బానిసగా మారారు. వారికి ఖర్చులకు డబ్బులు లేక గంజాయి తక్కువ ధరకు కొనుగోలు చేసి ఇక్కడకు తీసుక వచ్చి తాగిన తర్వాత మిగిలిన గంజాయి ఎక్కువ ధరకు విక్రయించాలని నిర్ణయించినట్లు తెలిపారు. గంజాయి ఎక్కడ దొరుకుతుందో తెలుసుకుని వారి స్నేహితుడు రాము అనే వ్యక్తి వద్ద రెండు నెలల క్రితం కొనుగోలు చేసి చుట్టు పక్కల గ్రామాల్లో ఎక్కువ ధరకు విక్రయించాలని నిందితులు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. బత్తిని చందు తన మోటార్‌సైకిల్ సీటు కింద పెట్టుకోగా, గోల్ల వెంకటేష్ తన మోటార్ సైకిల్ పెట్రోల్ ట్యాంకర్ కవర్లో గంజాయి పెట్టుకుని ధర్మపురి వైపు వెళ్తున్నట్లు తెలిపారు. హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్దకు రాగానే సాయంత్రం వేళలో ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ ఉదయ్‌కుమార్, పోలీస్ సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. నిందితుల వద్ద 2 కిలోల 70 గ్రాముల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు, రెండు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. గంజాయి విలువ రూ 40,000 వరకు ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కేసుతో సంబంధం కలిగి ఉన్న రాము అనే నిందితుడు పరారీలో ఉన్నట్లు వివరించారు. నిందితులను పట్టుకుని గంజాయి సీజ్ చేయడంలో చాకచక్యంగా వ్యవహరించిన డీఎస్పీ రఘుచందర్, ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ధర్మపురి ఎస్ఐ ఉదయ్‌కుమార్, ఏఎస్ఐ సూర్యనారాయణరాజు, హెడ్‌కానిస్టేబుల్స్ శంకర్, వెంకటయ్య, రామస్వామి, కానిస్టేబుల్ రమేష్, నవీన్‌కుమార్, రమేష్‌నాయక్, సిబ్బందిని జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్ ప్రత్యేకంగా అభినందించినట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐలు ఉదయ్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, ఉమాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

గడ్డి మందు తాగి వృద్ధుడి ఆత్మహత్య

జమ్మికుంట రూరల్, జూలై 5: జమ్మికుంట మండలం కాపులపల్లి గ్రామానికి చెందిన బైరెడ్డి రాంరెడ్డి (83) అనారోగ్యంతో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జమ్మికుంట పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. ఆరు నెలల నుంచి రాంరెడ్డి పక్షవాతంతో బాధపడ్డాడు. బీపీ, షుగర్ లెవల్స్ పెరిగి ఇరువై రోజుల క్రితం కళ్లు తిరిగి కిందపడ్డాడు. అనారోగ్యం వల్ల తీవ్ర మనస్థాపానికి గురైన రాంరెడ్డి ఇంట్లో నుంచి జమ్మికుంటకు వచ్చి గడ్డి మందు కొనుక్కుని పాత వ్యవసాయ మార్కెట్లో తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుమారుడు సమ్మిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

భర్త వేధింపులు భరించలేక ఆత్మహత్య

జమ్మికుంట, జూలై 4: భర్త వేధింపులు తాళలేక భార్య ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జమ్మికుంటలో గురువారం చోటు చేసుకుంది. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. వీణవంక మండలం వల్భాపూర్ గ్రామానికి చెందిన మారుమూళ్ల పద్మ, లక్ష్మయ్య దంపతుల కుమార్తె కావ్య (28)ను ఎల్బాక గ్రామానికి చెందిన జీడి రాజు అనే వ్యక్తికి ఇచ్చి 12ఏళ్ల క్రితం వివాహం జరిపించారు. మూడు సంవత్సరాలుగా దంపతులు ఇద్దరు పట్టణంలోని మారుతినగర్‌లో నివాసం ఉంటున్నారు. కావ్య ఎవరితోనో ఫోన్‌లో మాట్లాడుతోందని అనుమానం పెంచుకున్న భర్త రాజు ఆమెను కొట్టడం మొదలు పెట్టాడు. వేధింపులు ఎక్కువ కావడంతో తీవ్ర మనస్థాపానికి గురైన కావ్య ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వరంగంటి రవి తెలిపారు.

పీఏసీఎస్ రాయికల్‌కు ఎక్సలెన్స్, మెరిట్ అవార్డు


అవార్డు అందుకుంటున్న సహకార సంఘ సభ్యులు

రాయికల్, జూలై 4: రాయికల్ వ్యవసాయ సహకార సంఘానికి గురువారం ఎక్సలెన్స్, మెరిట్ అవార్డు లభించింది. నేషనల్ కో ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రాంతీయ కో ఆపరేటివ్ ఎక్సలెన్స్, మెరిట్-2023 అవార్డులో భాగంగా పీఏసీఎస్ రాయికల్‌ను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చేతుల మీదుగా పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, వైస్ చైర్మన్ బేతి మోహన్‌రెడ్డి, సీఈవో రవికుమార్, సిబ్బంది తెలంగాణ రాష్ట్రంలోనే ఉత్తమ ప్రైమరీ కో ఆపరేటివ్ సొసైటీ అవార్డు అందుకున్నారు. ఈ అవార్డుతో పాటు రూ.20 వేల ప్రోత్సాహక బహుమతి కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌సీఏబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, టీఎస్‌సీఏబీ ఎండీ బి.గోపి, ఎన్‌సీడీసీ రీజనల్ డైరెక్టర్ వంశీ, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

● రాయికల్ : రాయికల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఎక్సలెన్స్, మెరిట్ అవార్డును సాధించడం పట్ల జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ గురువారం సంఘం సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సంఘం సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, వైస్ చైర్మన్ బేతి మోహన్ రెడ్డి, సీఈవో రవి కుమార్ పాల్గొన్నారు.

రైస్ మిల్లుల్లో సివిల్ సప్లయీస్ అధికారుల తనిఖీ


కోరుట్ల మిల్లులో సివిల్ సప్లయ్ అధికారులు


రంగాపూర్ రైస్ మిల్లులో తనిఖీలు చేస్తున్న అధికారులు

జగిత్యాల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు రైస్ మిల్లుల్లో సివిల్ సప్లయీస్ అధికారులు విస్తృతంగా సోదాలు నిర్వహించారు. రాష్ట్ర సివిల్ సప్లయ్ శాఖ కమిషనర్ చౌహాన్ ఆదేశాల మేరకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇతర జిల్లాలకు చెందిన సివిల్ సప్లయ్ అధికారులు, ఎన్‌ఫోర్స్ బృందాలు రైస్‌మిల్లుల్లో గురువారం దాడులు నిర్వహించారు. ప్రభుత్వం రైస్ మిల్లులకు సీఎంఆర్ కోసం కేటాయించిన ధాన్యం నిల్వలు సరిగా ఉన్నాయా, లేవా అన్న అంశంపై అధికారులు తనిఖీలు నిర్వహించారు. జిల్లాలోని అయిదు చోట్ల సోదాలు జరిగాయి. జిల్లాలోని తక్కలపల్లిలో గల వేణు ఇండస్ట్రీస్, మాదాపూర్‌లోని విఘ్నేశ్వర్ రైస్ మిల్, కోరుట్ల పట్టణంలోని కొత్త సురేశ్ రైస్ మిల్లు, మేడిపల్లిలోని వాసుదేవ రైస్ మిల్, పెగ్గెర్ల సాయి గణేస్ ట్రేడర్స్ రైస్ మిల్లుల్లో సివిల్ సప్లయీస్ అధికారులు సోదాలు నిర్వహించారు. రైస్‌మిల్లుల్లో గల ధాన్యం నిల్వల ఫిజికల్ వెరిఫికేషన్ జరిపారు. తనిఖీల్లో గుర్తించిన వివరాలను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు జిల్లా సివిల్ సప్లయి అదికారి వెంకటేశ్వర్‌రావు తెలిపారు. కార్యక్రమంలో పెద్దపల్లి డీఎస్‌వో ప్రేమ్‌కుమార్, డీఎం శ్రీకాంత్, సిరిసిల్ల డీఎస్‌వో జితేందర్ రెడ్డి, డీఎం జితేందర్ ప్రసాద్, నిర్మల్ డీఎం నందిని, పలు మండలాల తహసీల్దార్లు, సీఐలు, ఎస్‌ఐలు, సివిల్ సప్లయి డిప్యూటీ తహసీల్దార్లు, ఫుడ్ ఇన్స్‌పెక్టర్లు, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా రైస్ మిల్లుల్లో సివిల్ సప్లయి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, డీఎస్‌ఓలు, డీఎంలు సోదాలు నిర్వహించడం వ్యాపార వర్గాల్లో కలకలం రేపింది.

వెంకటయ్య కళ్లు సజీవం


వెంకటయ్య (ఫైల్)

జమ్మికుంట రూరల్, జూలై 4: జమ్మికుంట పట్టణానికి చెందిన చిదురాల వెంకటయ్య (92) బుధవారం రాత్రి అనారోగ్యంతో మృత్యువాత పడ్డాడు. సదాశయ ఫౌండేషన్ నిర్వాహకులు నేత్రదానంపై కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించగా వారు ముందుకు వచ్చారు. దీంతో వరంగల్ ఎల్‌విపి టెక్నీషియన్ సహకారంతో నేత్రాలు సేకరించి హైదరాబాద్‌లోని ఐ బ్యాంక్‌కు పంపించారు.

పెద్దమ్మ ఆలయంలో దొంగతనం

కొడిమ్యాల, జూలై 4: మండలంలోని తిప్పయ్యపల్లి గ్రామంలోని పెద్దమ్మ ఆలయంలో దొంగతనం జరిగిందని కొలకాని నర్సయ్య గురువారం మధ్యాహ్నం ఫిర్యాదు చేసినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 1 నుంచి 4 తేదీ ఉదయం వరకు గుర్తు తెలియని వ్యక్తులు పెద్దమ్మ ఆలయం తలుపులు పగుల గొట్టి సుమారు 15 వేల 500 రూపాయల విలువైన బంగారు ఆభరణాలు ఎత్తుకపోయినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆదాయ పన్నుపై అవగాహన అవసరం

- హరి అశోక్‌కుమార్


కార్యక్రమంలో మాట్లాడుతున్న హరి అశోక్ కుమార్

జగిత్యాల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఆదాయ పన్నుపై అవగాహన అవసరమని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్‌కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యాలయంలో పెన్షనర్స్‌తో ఆదాయపన్ను అంశంపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఐటీ రిటర్న్‌లు ఫైల్ చేస్తే కలిగే ప్రయోజనాలను తెలుసుకోవాల్సిన అవసరముందన్నారు. రుణం కోసం గానీ, వీసా కోసం గానీ దరఖాస్తు చేసుకునే సమయాల్లో పన్ను రిటర్నులు ఉపయోగపడుతాయన్నారు. బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు ఇచ్చే రుణాల కోసం పన్ను రిటర్న్ రుజువు సమర్పించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా సహాయ అధ్యక్షుడు హన్మంతరెడ్డి, ప్రధాన కార్యదర్శి బొల్లం విజయ్, నాయకులు ప్రకాశ్ రావు, దిండిగల విఠల్, ఎండీ యాకూబ్, సత్యనారాయణ, శివానందం తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

కోనరావుపేట, జూలై 4 : అప్పుల బాధతో సావనపెల్లి స్వామి (37) అనే వ్యక్తి గురువారం తెల్లవారుజామున ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కోనరావుపేట మండలం ధర్మారం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ధర్మారం గ్రామానికి చెందిన సావనపెల్లి స్వామి అనే వ్యక్తి తమకు 5 ఎకరాల భూమి ఉండగా అప్పుల బాధతో అటు భూమిని అమ్మి వేశారు. మరో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. అయినప్పటికీ వ్యవసాయంలో రాబడి రాక అప్పుల పాలయ్యాయి. అంతే కాకుండా భార్య లాస్య గుండె సంబంధించిన శస్త్ర చికిత్స కోసం కూడా అప్పులు చేశాడు. చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనస్థాపానికి గురై బుధవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయాన్ని కోనరావుపేట ఎస్సై అంజనేయులు సంఘటనా స్థలానికి చేరుకొని ఆత్మహత్యకు గల కారణం పరిశీలించి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసినట్టు తెలిపారు. మృతునికి తల్లి షైసవ్వ, భార్య లాస్య, కుమారుడు శ్రీహన్ ఉన్నారు.

ఒమన్‌లో బొమ్మెన వాసి మృతి


సత్యనారాయణ(ఫైల్)

కథలాపూర్, జూలై 4 : మండలంలోని బొమ్మెనకు చెందిన పంజాల సత్యనారాయణ (54) అనే గల్ఫ్ వలసజీవి బుధవారం రాత్రి ఓమన్‌లో గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం ప్రకారం...సత్యనారాయణ రెండు సంవత్సరాల కిందట ఉపాధి నిమిత్తం ఒమన్ వెళ్లాడు. భవన నిర్మాణ కంపెనీలో కూలీగా పని చేస్తున్న సత్యనారాయణ డ్యూటీ ముగించుకుని గదికి వచ్చాడు. అప్పటి దాకా గదిలో ఉన్న సహచరులతో మాట్లాడిన సత్యనారాయణ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. మృతునికి భార్య, ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు. మరణవార్త విన్న కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతదేహాన్ని స్వగ్రామానికి తొందరగా పంపించే ఏర్పాట్లు చేయాలని, మృతుని కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా అందించాలని ప్రజాప్రతినిధులు కోరారు.

వ్యవసాయ బావుల మోటారు దొంగల అరెస్టు

ఇల్లంతకుంట, జూలై 4: మండలంలోని తాళ్ళపెల్లి గ్రామానికి చెందిన నాంపెల్లి కనుకయ్య అనే రైతుకు చెందిన వ్యవసాయ మోటారును దొంగిలించిన వారిని పట్టుకొని అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం గురువారం తాళ్ళపల్లి గ్రామ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వడ్లూరు గ్రామానికి చెందిన బిగుళ్ళ శ్రావణ్, ముత్తన్నపేట గ్రామానికి చెందిన కనగాండ్ల అజయ్‌ను పట్టుకొని విచారించగా వ్యవసాయ మోటార్‌ను అపహరించి గుండ్లపల్లి గ్రామానికి చెందిన వనరాసి కొమురయ్యకు అమ్మినట్లు అంగీకరించారు. వీరి వద్ద నుండి వ్యవసాయ మోటార్‌తో పాటు ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకొని నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత


శంకరపట్నం, జూలై 4: శంకరపట్నం మండలం వంకాయగూడెం గ్రామంలో టాస్క్‌ఫోర్స్, కేశవపట్నం పోలీసులు గురువారం 40క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. వంకాయగూడెం గ్రామానికి చెందిన ధరావత్ శ్రీను, దీరావత్ హరాలాల్, ధనావత్ శ్రీను ఇళ్లలో నిల్వ చేసిన 40క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మారెడ్డి తెలిపారు.

ధాన్యం కమీషన్ డబ్బుల కింద ఫర్టిలైజర్

● డీసీఎంఎస్‌లో ఎరువుల అక్రమ అమ్మకాలపై ఏసీబీ విచారణ ● లక్ష రూపాయల లంచంతో పట్టుబడిన మేనేజర్, క్యాషియర్


ఏసీబీకి పట్టుబడ్డ జూనియర్ అసిస్టెంట్ కుమారస్వామి, మేనేజర్ వేంకటేశ్వర్‌రావు

కరీంనగర్ క్రైం, జూలై 4: జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్)లో ధాన్యం కొనుగోలు, ఫర్టిలైజర్ అమ్మకాలపై ఏసీబీ పోలీసులు లోతుగా విచారణ జరుపుతున్నారు. వరి, మొక్కజొన్న ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా డీసీఎంఎస్‌కు వచ్చిన కమీషన్ డబ్బులో 50 శాతం కేంద్రాల నిర్వహణ కాంట్రాక్టర్‌కు బిల్లు చెక్ రూపంలో చెల్లించాల్సి ఉంది. కానీ అందుకు విరుద్ధంగా ఫర్టిలైజర్‌ను డీసీఎంఎస్ మేనేజర్ రేగులపాటి వెంకటేశ్వర్‌రావు బలవంతంగా కాంట్రాక్టర్ కావటి రాజుకు అంటగట్టి అక్రమాలకు పాల్పడ్డట్లు ఏసీబీ అధికారుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఫర్టిలైజర్ ఇచ్చేందుకు లైసెన్స్ కలిగి ఉండాలని, కాంట్రాక్టర్ చేత బలవంతంగా వ్యవసాయశాఖ నుంచి అతడి ఊరిలో ఫర్టిలైజర్ దుకాణం నిర్వహణకు లైసెన్స్ తీయించిన తరువాత ఫర్టిలైజర్‌ను ఇచ్చినట్లు బాధిత కాంట్రాక్టర్ తెలిపారు. కరీంనగర్ డీసీఎంఎస్ మేనేజర్ రేగులపాటి వెంకటేశ్వర్‌రావు, క్యాషియర్ సుదగోని కుమారస్వామిలు డీసీఎంఎస్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ కాంట్రాక్టర్ వాకటి రాజు వద్ద లక్ష రూపాయలు లంచం తీసుకుంటుండగా గురువారం ఏసీబీ పోలీసులు అరెస్టు చేశారు. 2018-19 సీజన్ నుంచి 2023-24 సీజన్ వరకు ధాన్యం కమీషన్ డబ్బులు మొత్తం 90 లక్షల 16 వేల 652 రూపాయలు కాంట్రాక్టర్‌కు చెల్లించాల్సి ఉంది. ఈ డబ్బులు(పెండింగ్ బిల్లులు) కోసం కాంట్రాక్టర్ తిరిగి వేసారిపోయాడు. కాంట్రాక్టర్‌కు చెక్ రూపంలో చెల్లించాల్సిన డీసీఎంఎస్ మేనేజర్ నిబంధనలకు విరుద్ధంగా అతడికి 20 లక్షల 91 వేల 500 రూపాయల విలువ కలిగిన ఫర్టిలైజర్‌ను ఇచ్చాడు. మరో 69 లక్షల 25 వేల 152 రూపాయల ఫర్టిలైజర్‌ను కమీషన్ డబ్బుల కింద ముట్టజెప్పేందుకు ఒప్పందం కుదరగా ఇందుకు లంచంగా 15 లక్షల రూపాయలు మేనేజర్‌కు కాంట్రాక్టర్ ఇవ్వాలని ఒప్పందం కుదిరింది. ఈ సమయంలోనే మొదటి లక్ష రూపాయలు తీసుకుంటున్న క్రమంలో మేనేజర్, క్యాషియర్‌లను ఏసీబీ పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కాగా ఏసీబీకి పట్టుబడిన డీసీఎంఎస్ మేనేజర్ వెంకటేశ్వర్‌రావు ఆగస్టు నెలలో పదవీ విరమణ చేయనున్నారు. తనకు రావాల్సిన కమీషన్ బిల్లు కోసం 5 సంవత్సరాల నుంచి అధికారుల చుట్టూ తిరుగుతున్నానని, అప్పులు తెచ్చి ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వహించానని బాధితుడు కావటి రాజు తెలిపారు. తన కమీషన్ డబ్బులు డీసీఎంఎస్‌కు వచ్చినప్పటికీ చెక్ ఇవ్వకుండా లంచం డబ్బుల కోసం తనకు ఫర్టిలైజర్‌ను అంటగట్టారని వాపోయాడు. ఫర్టిలైజర్ బస్తాకు 15 రూపాయలు అదనంగా లెక్కగట్టారని, తన ఊరికి అదనంగా మరో 15 రూపాయల రవాణా చార్జీ అయిందని, ఈ విధంగా బస్తాకు 30 రూపాయల వరకు నష్టం వాటిల్లిందని అతడు వాపోయాడు.


మాట్లాడుతున్న ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి , బాధితుడు రాజుయాదవ్

● కరీంనగర్ రీజియన్ ఏసీబీ డీఎస్పీ వి.రమణమూర్తి, బాధితుడు కావటి రాజు తెలిపిన వివరాల ప్రకారం జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణను ప్రైవేట్ వ్యక్తి అయిన పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం ఇందుర్తి గ్రామానికి చెందిన కావటి రాజు అనే కాంట్రాక్టర్ నిర్వహిస్తున్నాడు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ ద్వారా డీసీఎంఎస్‌కు క్వింటాల్ ధాన్యానికి 32 రూపాయల కమీషన్ వస్తుండగా అందులో నుంచి 50 శాతం అనగా 16 రూపాయలు కేంద్రాల నిర్వహణ కాంట్రాక్టర్ కావటి రాజుకు చెల్లించాలని ఒప్పందం ఉంది. దీని ప్రకారం 2018 నుంచి 2023 వరకు వరి, మొక్కజొన్న ధాన్యం సేకరణపై కాంట్రాక్టర్ రాజుకు మొత్తం 90 లక్షల 16 వేల 652 రూపాయలు రావాల్సి ఉంది. కాంట్రాక్టర్ రాజుకు డబ్బులు ఇవ్వాలంటే లంచం కోసం డీసీఎంఎస్ మేనేజర్ వెంకటేశ్వర్‌రావు వేధిస్తున్నాడు. దీంతో విసిగిపోయిన కాంట్రాక్టర్ రాజు ఏసీబీని ఆశ్రయించాడు. లంచం డబ్బులు తీసుకుంటూ పట్టుబడిన మేనేజర్ వెంకటేశ్వర్‌రావు, క్యాషియర్ కుమారస్వామిలను అరెస్టు చేశామని, శుక్రవారం కరీంనగర్ ఏసీబీ కోర్టులో హాజరు పరచనున్నట్లు ఏసీబీ డీఎస్పీ తెలిపారు.

నేతన్నలు ఆత్మహత్యలు చేసుకోవద్దు

● సీపీఎం కేంద్ర కమిటీ పోలిట్ బ్యూరో సభ్యుడు చెరుపల్లి సీతారాములు


ఆత్మహత్య చేసుకున్న కుటుంబాన్ని పరామర్శిస్తున్న సీతారాములు

సిరిసిల్ల రూరల్, జూలై 4: నేతన్నలు ఉపాధి లేదంటూ ధైర్యం కోల్పోయి ఆత్మహత్యలు చేసుకుని కుటుంబాలను రోడ్డున పడేయవద్దని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం నేతన్నల జీవితాలతో రాజకీయం చేయకుండా వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి కార్మికులకు ఉపాధి కల్పించాలని మాజీ ఎమ్మెల్సీ, సీపీఎం కేంద్ర కమిటీ పోలిట్ బ్యూరో సభ్యులు చెరుపల్లి సీతారాములు కోరారు. సిరిసిల్ల పట్టణంలో గురువారం సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మూషం రమేష్, కూరపాటి రమేష్‌లతో కలిసి ఇటీవల ఆత్మహత్య చేసుకున్న నేతన్న కుటుంబాలను పరామర్శించారు. వారికి సీపీఎం పార్టీ అండగా ఉంటుందని ప్రభుత్వం వారిని ఆదుకునేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తామని అన్నారు. ప్రభుత్వం వెంటనే ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు. చేనేత జౌళి శాఖ కార్యాలయం వద్ద జరిగిన కార్మికుల సమావేశంలో కార్మికులతో మాట్లాడారు. ఆత్మహత్యలు చేసుకోవద్దని పోరాటాల ద్వారానే అన్ని సాధించుకుంటామని అన్నారు. అనంతరం చేనేత జౌళి శాఖ ఏడీ మిట్టకోల సాగర్‌ను కలిసి కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. అనంతరం సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ శివారులో నిర్మిస్తున్న అపెరల్ పార్కులో వర్కర్ టు ఓనర్ షెడ్లను పరిశీలించారు. అనంతరం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ ప్రధానంగా నాలుగు సమస్యల వలన పూర్తిగా సంక్షోభంలోకి కూరుకపోయి మొత్తం పరిశ్రమలు మూతపడ్డాయని అన్నారు. ప్రధాన సమస్యలు బతుకమ్మ చీరల తయారీ ఆర్డర్లు ప్రభుత్వం రద్దు చేయడంతో పాటు కరెంటు సబ్సిడీ తొలగించడం, మార్కెట్‌లో ప్రస్తుతం తయారు చేసే వస్త్రానికి డిమాండ్ లేకపోవడంతో పాటు పాత బకాయిలు విడుదల చేయకపోవడం వలన వస్త్ర పరిశ్రమలో సంక్షోభం ఏర్పడడంతో పాటు కార్మికులకు ఏడు నెలలుగా ఉపాధి లేకుండా పోయిందని అన్నారు. కార్మికులకు సరైన ఉపాధి లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక ఇప్పటివరకు 9 మంది కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని అన్నారు. ప్రభుత్వం వెంటనే దీన్ని రాజకీయ కోణంగా చూడకుండా సమస్యలను పరిష్కరించాలని అన్నారు. నూతన పరిశ్రమలు తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. పవర్‌లూమ్ పరిశ్రమలకు ఉచిత విద్యుత్ అందించాలని లేకుంటే గతంలో మాదిరిగా అన్ని కేటగిరీలకు విద్యుత్ సబ్సిడీ కొనసాగించాలని అన్నారు. బతుకమ్మ చీరల ఆర్డర్లు, లేకుంటే జనతా వస్త్రాల పథకం ద్వారా ఒక చీర, ఒక పంచా సిరిసిల్లలో ఉత్పత్తి చేయించడంతో పాటు వర్కర్ టు ఓనర్ వెంటనే పూర్తిచేసి కార్మికులను యజమానులు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు యారన్ సబ్సిడీతో పాటు బతుకమ్మ చీరల పెండింగ్ బకాయిలను విడుదల చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు కోడం రమణ, సిరిమల్లె సత్యం జవ్వాజీ విమల, సూరం పద్మ, అన్నల్‌దాస్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై యువకుడి అత్మహత్య

వీణవంక,జూలై04:మండలంలోని నర్సింగాపూర్ గ్రామనికి చెందిన దాసారపు ప్రశాంత్ (29) మద్యానికి బానిసై అత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం ప్రశాంత్ ఆరు నెలలుగా మద్యానికి అలువాటై జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని అత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. మృతుడి అన్న వినోద్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాట్లు ఎస్సై తోట తిరుపతి తెలిపారు.

ప్రయాణికులను బెదిరించిన యువకుల పట్టివేత


బస్టాండ్‌లో ఆర్టీసీ సెక్యూరిటీ అదుపులో ఉన్న పాత నేరస్థులు

కరీంనగర్ క్రైం, జూలై 4: కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులను బెదిరింపులకు గురి చేస్తూ దాడులకు పాల్పడుతున్న ఇద్దరు యువకులను ఆర్టీసీ సెక్యూరిటీ పోలీసులు గురువారం పట్టుకున్నారు. పట్టుబడిన ఇద్దరు యువకులు పాత నేరస్థులు, గంజాయి సేవించేవారని ఆర్టీసీ సెక్యూరిటీ పోలీసులు తెలిపారు. పట్టుకున్న ఇద్దరిని ఒకటో ఠాణా పోలీసులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్ రమణ, ఎం.సాగర్, సెక్యూరిటీ కానిస్టేబుల్ కవిత, నవీన్ పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో క్యాబ్ డ్రైవర్ అనుమానాస్పద మృతి


గాండ్ల శ్రీనివాస్(ఫైల్)

నార్సింగ్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): నార్సింగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హైదర్షాకోట్ శాంతినగర్ బస్‌స్టాప్ వద్ద కారులో అనుమానస్పదస్థితిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన గాండ్ల శ్రీనివాస్ (34) హైదర్షాకోట్ వెస్టర్న్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. శ్రీనివాస్ వృత్తి రీత్యా కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శ్రీనివాస్ మూడు రోజులు నుంచి ఇంటికి రాలేదు. గురువా రం మధ్యాహ్నం శాంతినగర్ బస్‌స్టాప్ సమీపంలోని పార్కింగ్ ఏరియాలో కారులో నుంచి దుర్వాసన వస్తుండగా స్థానికులు గుర్తించారు. అనంతరం పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి పోలీసులు హుటాహుటిన చేరుకొని పరిశీలించారు. కారులో శ్రీనివాస్ మృతి చెందినట్లు కనిపించాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు అల్ఫోర్స్ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

భగత్‌నగర్, జూలై 4: రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. గురువారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు కె.హర్షిత్, పి.ప్రసన్నకుమార్‌లను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతోపాటు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించే విధంగా నిష్ణాతులైన వారితో శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు. ఈ నెల 14న మెదక్ జిల్లాలో నిర్వహించే రాష్ట్ర స్థాయిలో పోటీల్లో రాణించి జాతీయ స్థాయిలో ఎంపిక కావాలని ఆకాంక్షించారు.

'బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడుతున్న కౌశిక్‌రెడ్డి'



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు కాశెట్టి శ్రీనివాస్

కరీంనగర్ రూరల్, జూలై4: హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడుతున్నాడని మండల రైతు బంధు సమితి మాజీ కో ఆర్డినేటర్, కాంగ్రెస్ నాయకుడు కాశెట్టి శ్రీనివాస్ విమర్శించారు. గురువారం తీగలగుట్టపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కరీంనగర్, హుజురాబాద్ ఎమ్మెల్యేలు, గంగుల కమలాకర్, పాడి కౌశిక్‌రెడ్డిలు చట్ట ప్రకారం వ్యవహరిస్తున్న అధికారులను బెదిరస్తు బ్లాక్ మెయిల్ రాజకీయం చేయడం మానుకోవా లన్నారు. ఇటీవల జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఒక రౌడీలా వ్యవహరించి జిల్లా కలెక్టర్‌నే అడ్డుకోవడం ఆయన తిగజారిన రాజకీయాలకు అద్దంపడుతుందన్నారు. జెడ్పీ సిఈఓ పోలీసులకు ఫిర్యాదు చేస్తే మంత్రి పొన్నం ప్రభాకర్‌పై ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు.

అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించకపోతే కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకుంటానని శవ రాజకీయాలు చేసిన ఘనత కౌశిక్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు. కన్న బిడ్డలాంటి బీఆర్‌ఎస్ కార్యకర్తలపైనే కేసులు పెట్టి వేధించిన ఘనత స్థానిక ఎమ్మెల్యేకే దక్కుతుందని తెలిపారు. ఎమ్మెల్యే వైఖరితోనే సీనియర్ నాయకులందరు బీఆర్‌ఎస్ నుంచి ఇతర పార్టీల వైపు చూస్తున్నారని అన్నారు. ఎ రానున్న రోజుల్లో ఉన్న కార్యకర్తలు కూడా మిగలరని జోస్యం చెప్పారు. ఎమ్మెల్యేగా కౌశిక్‌రెడ్డి ప్రజా సమస్యలపై పోరాడాలే కాని బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేయవద్దన్నారు. కార్యక్రమంలో మాజి ఉపసర్పంచ్ కృష్ణారెడ్డి, నాయకులు అల్లిబిల్లి నగేష్, శ్రీనివాస్, వినయ్, కాశెట్టి దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్లమెంట్ ఇన్‌చార్జిని కలిసిన కార్పొరేటర్లు

కరీంనగర్ అర్బన్, జూలై4: కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావును కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు కార్పొరేటర్లు గురువారం మర్యదపూర్వకంగా కలిశారు. తమ డివిజన్లలో చేపట్టి అర్థాంతరంగా నిలిచిపోయిన పనులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకువెళ్ళారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న పనులకు సంబంధించిన నిధులను విడుదల చేసి పనులను పూర్తి చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాని కోరారు. కార్పొరేటర్ల విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన వెలిచాల రాజేందర్‌రావు ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు చేపట్టిన పనులే కాకుండా ఇంకా చేపట్టాల్సిన పనులపై ప్రణాళికలు సిద్ధం చేసి కరీంనగర్ అభివృద్ధికి సహకరిస్తానన్నారు. ఈకార్యక్రమంలో కార్పొరేటర్లు చాడగొండ బుచ్చిరెడ్డి, గంట కల్యాణి, భూమాగౌడ్, నాయకులు ఆకుల ప్రకాశ్, గంట శ్రీనివాస్, సరిల్ల ప్రసాద్, ఆకుల నరసయ్య, పిట్టల శ్రీనివాస్, వైద్యుల అంజన్‌కుమార్ పాల్గొన్నారు.

బాసర ట్రిపుల్ ఐటీకి చొప్పదండి విద్యార్థుల ఎంపిక



ఎలిగేటి సవిత



గాలిపల్లి అక్షిత



కనుమల్ల నవీన

చొప్పదండి, జూలై4: బాసర ట్రిపుల్ ఐటీకి చొప్పదండి బాలికల జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినిలు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన ఎలిగేటి సవిత, గాలిపెల్లి అక్షిత, కనుమల్ల నవీనలు ట్రిపుల్ ఐటీకి ఎంపిక య్యారు. కాగా వీరిలో సవిత, అక్షితలు పదవ తరగతిలో 10జీపీఏ సాధించగా, నవీన 9.8 జీపీఎ సాధించి ట్రిపుల్ ఐటీలో ప్రవేశం పొందారు. విద్యార్థినిలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు జంగం శ్రీనివాస్, ఆర్ మహేష్, ఎం శ్రీనివాస్, ఎన్ అంజనీదేవి, కె ముకుందరెడ్డి, వై తిరుపతి, బి పల్లవి, పి శ్రీధర్, ఈ భవిత, శ్రీవాణి, ఈ స్నేహలతలు అభినందించారు. రుక్మాపూర్ మోడల్ స్కూల్ విద్యార్థులు చరణ్, హాసినిలు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రమేష్ తెలిపారు.

● శంకరపట్నం: బాసర ట్రిపుల్ ఐటీకి శంకరపట్నం మండల మోడల్ స్కూల్ నుంచి ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. బాసర ట్రిపుల్ ఐటీలో తాళ్ల నిఖిల, ముష్కే కావ్య, సుంకె సంజన, గట్టు స్పందన, రెడ్డి శ్రీనిధి, కళ్లపల్లి సంతోష్‌కుమార్‌లు సీటు సాధించగా ప్రిన్సిపాల్ జ్యోతి అభినందించారు.

● మానకొండూర్: మండలంలోని పోచంపల్లి ఆదర్శ పాఠశాలలో 2023-24 సంవత్సరంలో పదవతరగతి ఉత్తీర్ణులైన మండలంలోని మానకొండూర్, ముంజంపల్లి గ్రామాలకు చెందిన కుందేళ్ల అక్షయ, గొగూరి గాయత్రిలు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. దీనిపై ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

హుజూరాబాద్‌రూరల్, జూలై 4: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకొని కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ పిలుపు మేరకు మండలంలోని జూపాక గ్రామంలో బీజేపీ నాయకులతో కలిసి మొక్కలు నాటారు. ఈ నెల 6వ తేదీన జిల్లా వ్యాప్తంగా బీజేపీ నాయకులు అమ్మపేరిట ఒక మొక్క నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు రాముల కుమార్, అసెంబ్లీ కన్వీనర్ మాడ గౌతంరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి సంపత్‌రావు, మండల ఉపాధ్యక్షులు ముప్పు మహేష్, జీడీ మల్లేష్, పంజాల రాజయ్య, పంజాల రాకేష్ తదితరులు ఉన్నారు.

ఐటిఐలో ప్రవేశాలను సద్వినియోగం చేసుకోవాలి

జమ్మికుంట, జూలై 2: జమ్మికుంట పట్టణంలోని జిఎస్ఆర్ ఐటిఐలో ప్రారంభమైన రెండవ ఫేజ్ ప్రవేశాలను సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ముస్కే వీరరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటిఐ చేసే విద్యార్థులకు వారి విద్యార్హతలను బట్టి పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో కూడిన ఉచిత విద్య అందుబాటులో ఉందని, అంతేకాకుండా ఐటిఐ పూర్తి చేసిన విద్యార్థులకు ప్రముఖ కంపెనీలలో అప్రెంటిస్‌షిప్, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ప్రవేశాలు పొందడానికి కళాశాలను సందర్శించాలని కోరారు.

మంత్రిని కలిసిన కాంగ్రెస్ మండల నాయకులు

వీణవంక, జూలై4: మండల కాంగ్రెస్ నాయకులు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను హుస్నాబాద్‌లో కలిశారు. మండలంలోని పలు సమస్యలు మంత్రి దృష్టికి తీసుకెళ్లగా సానుకులంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో ఎక్కటి రఘుపాల్ రెడ్డి,గంగాడి తిరుపతి రెడ్డి,పంజాల సతీష్ గౌడ్,గెల్లు శ్రీనివాస్, చేపూరి రాజు తదితరులున్నారు.

లక్షలు వెచ్చించారు.. లక్షణంగా వదిలేశారు

-కానరాని సమావేశాలు -అస్తవ్యస్తంగా మారిన రైతు వేదికలు





దుర్శేడ్ రైతు వేదిక భవనం ఆవరణలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు, నగునూరులో విరిగిన తలుపులు

కరీంనగర్ రూరల్, జూలై4: రైతులకు ఆధునిక, సాంకేతిక సమాచారాన్ని అందించేందుకు ఒక వేదికను నిర్మించాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు వేదికల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. ఆరేళ్ళ క్రితం అట్టహాసంగా రైతు వేదికల నిర్మాణం చేపట్టగా అసంపూర్తిగానే పనులు చేపట్టి చేతులు దులుపుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రైతుల సౌకర్యార్థం కోసం నిర్మించిన రైతు వేదికలు కనీస సౌకర్యాలు లేక, చేసిన పనుల్లో నాణ్యతలేక నిర్లక్ష్యంతో వదిలి వేస్తున్నారు. లక్షలు వెచ్చించిన ప్రభుత్వం ఆ తరువాత పట్టించుకున్న పాపాన పోలేదు. రతు వేదికల నిర్లక్ష్యానికి గురవుతున్న పట్టించుకునే వారే కరువయ్యారు. కరీంనగర్ రూరల్ మండలంలో మొగ్దుంపూర్, నగునూర్, దుర్శేడ్, చామనపల్లి గ్రామాల్లో రైతు వేదికలు మంజూరు కాగా ఒక్కో రైతు వేదికకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిధులను మంజూరు చేసింది. ఎన్ఆర్‌జీఎఫ్ నిధులు కలుపుకుని దాదాపుగా 22లక్షల రూపాయలతో పనులు చేపట్టారు. రైతు వేదిక భవనాల పనులు చేపట్టి సంవత్సరాలు గడుస్తున్న భవన పనులు అస్తవ్యస్తంగా చేయడంతో పనులు అసంపూర్తిగానే మిగిలి ఉన్నాయి. దీంతో భవనంలో రైతులకు సంబంధించిన కార్యక్రమాలు కానరాకుండా పోయాయి. చేసిన పనులు నాణ్యతా లోపాలతో దర్శనమిస్తున్నాయి.

బాత్‌రూములు నిర్మించి నప్పటికీ తలుపులు బిగించలేదు. నీటి సదు పాయం ఏర్పాటు చేయలేదు. నల్లాలు బిగించలేదు. గోడలు పెచ్చులు తేలుతుండగా, నగునూర్ గ్రామంలోని రైతు వేదిక భవన తలుపులు సరిగా లేకపోవడంతో అడ్డంగా నీళ్ళట్యాంక్‌ను ఏర్పాటు చేశారు. కనీస సౌకర్యాలు కూడా ఏర్పాటు చేయక పోవడంతో భవనాల్లో సమావేశాలు కూడా నిర్వహించలేని స్థితి నెలకొంది. సమావే శాలకు కావలసిన ఫర్నిచర్ కూడా ఏర్పాటు చేయక పోవడంతో అసౌకర్యాల మధ్య సమావేశాలు నిర్వహించలేని పరిస్థితి నెలకొంది. భవనాలు నిరుపయోగంగా మారడంతో అసాంఘిక కార్యకలా పాలకు నిలయాలుగా మారుతున్నాయి. సంబంధిత అధికారులు చొరవ తీసుకుని రైతు భవనాల్లో సౌకర్యాలు మెరుగు పరిచి రైతులు వినియోగించుకునేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

ఆర్‌వోబీ పనుల పరిశీలన

కరీంనగర్ రూరల్, జూలై4: అర్థాంతరంగా నిలిచిపోయిన తీగలగుట్టపల్లి ఆర్‌వోబీ పనులు తిరిగి ప్రారంభం కావడంతో ఒకటో డివిజన్ కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్ స్థానిక బీజేపీ శ్రేణులతో కలిసి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్థాంతరంగా నిలిచిపోయిన ఆర్‌ఓబి పనుల విషయాన్ని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ దృష్టికి తీసుకెళ్ళి ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. ఈ విషయంలో సానుకూలంగా స్పం దించిన బండి సంజయ్‌కుమార్ అధికారులతో మాట్లాడి ఆర్‌ఓబి నిర్మాణ పనులు వెంటనే మొదలు పెట్టడానికి చర్యలు తీసుకోవాలని, అక్కడి ప్రాంతంలో గుంతల రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరడంతోనే మళ్ళీ నిర్మాణ పనులు ప్రారంభించారన్నారు. పనుల ప్రాంతంలో జటిలంగా ఉన్న ఆర్‌ఓబి సమస్యలను పరిష్కరించిన, పనులను ప్రారంభించడానికి సహకరించిన కేంద్ర మంత్రికి బీజేపీ నాయకులు ఒడ్నాల కోటేశ్వర్, కైలాస నవీన్, గాండ్ల నరేష్, జి.వీరన్న, సురేందర్‌రెడ్డి, జె.కర్ణాకర్, కె.సత్యనారాయణ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

తుల రాజేందర్‌కు డాక్టరేట్

కరీంనగర్ కల్చరల్, జూలై 4: ఉద్యమకారుడు, రచయిత తుల రాజేందర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం నుంచి పీహెచ్‌డీ పట్టా సాధించారు. లోయర్ మానేరు డ్యాం ముంపు గ్రామాల ప్రజల పునరా వాసం-సామాజిక ఆర్థిక పర్యవసానాలు అనే అంశంపై రాజేందర్ పరిశోధన చేశారు. కరీంనగర్ ప్రక్కన గల ఎల్ఎండి కింద కోల్పోయిన 18 గ్రామాల ప్రజలు ఎక్కడెక్కడ ఉన్నారో తెలుసుకొని ప్రొఫెసర్ పద్మనాభరావు ఆధ్వర్యంలో వాళ్ళ జీవన పరిస్థితులను ఆయన అధ్యయనం చేశారు. పీహెచ్‌డి పరీక్షలో నెగ్గిన ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేస్తున్నట్లు విశ్వ విద్యాలయం పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ బి శ్రీనివాస్ ప్రకటించారు. తుల రాజేందర్ గతంలో తెలుగు అకాడమీలో ఉన్నతాధికారిగా పని చేసి ఉద్యోగ విరమణ అనంతరం న్యాయవాద విద్యను అభ్యసించి ఎల్ఎల్ఎం పూర్తి చేశారు. గతంలో పనిచేసిన జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ తుల ఉమకు రాజేందర్ భర్త.

సుందరేశ్వరుడికి ఫల పంచామృతాభిషేకం

కరీంనగర్ రూరల్, జూలై4: మాస శివరాత్ర సందర్భంగా గురువారం కరీంనగర్ మండలం నగునూర్ గ్రామంలోని పరివార సమేత దుర్గాభవాని దేవాలయంలో కొలువై ఉన్న సుందరేశ్వర స్వామి వారలకు వేదపండితులు పురాణం మహేశ్వరశర్మ ఆధ్వర్యంలో, ఆలయ ప్రధానర్చకులు పవనకృష్ణ శర్మ విశేష అభిషేకం, ఫలపంచామృతాభిషేకం, విశేష హరతి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో ఆలయ కమిటీ బాధ్యులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పర్యావరణపై అవగాహన ఉండాలి

కరీంనగర్‌టౌన్, జూలై4: విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన ఉండాలని జిల్లా విద్యాధికారి సిహెచ్‌విఎస్ జనార్ధన్‌రావు అన్నారు. చిన్ననాటి నుండే ప్రకృతి పట్ల ఆరాధన భావాన్ని పెంపొందించుకోవాలని జిల్లా విద్యాధికారి సిహెచ్ విఎస్ జనార్ధన్‌రావు అన్నారు. గురువారం అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్క రించుకుని జిల్లా విద్యాశాఖ, జిల్లా సైన్స్ ఆఫీస్ ఆధ్వర్యంలో ఫిల్మ్ భవన్‌లో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ విద్యార్థులు పర్యావరణ స్పృహ అలవర్చుకోవాలని సూచించారు. గ్రీన్ హౌస్ ఎఫెక్ట్ గ్లోబల్ వార్మింగ్‌లతో భూమి వేడెక్కడం, వాతావరణ పరిస్థితుల్లో మార్పులు సంభవిస్తున్నాయన్నారు. భూమి పునరుద్ధరణ, ఎడారీకరణ నివారణ, కరువును తట్టుకునే శక్తి అనే అంశాలపై విద్యార్థులకు పోస్టర్ తయారీ, కవిత్వ రచన పోటీలు నిర్వహించి సర్టిఫికెట్లతో పాటు, జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి చాడ జైపాల్‌రెడ్డి, అకడమిక్ మానిటరింగ్ అధికారి కర్ర అశోక్‌రెడ్డి, మండల విద్యాధికారి మధుసూదనాచారి, డిసిఇబి కార్యదర్శి మారం స్వదేశీకుమార్, రవీందర్, మిల్కూరి శ్రీనివాస్, ఆంజనేయులు, ఉజ్వల, కె సుధాకర్, మంజూరలి, ఓదెలుకుమార్ పాల్గొన్నారు.

'మౌలిక సదుపాయాల కల్పనకు కృషి'



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, జూలై 4: నగర పాలక సంస్థ పరిధిలో మౌళిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. గురువారం స్థానిక 15వ డివిజన్ ప్రగతినగర్‌లో కార్పొరేటర్ నాగసముద్రం జయలక్ష్మితో కలిసి ఆరు లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్, ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శరవేగంగా నగరం నలుదిశలా విస్తరిస్తోందని, విలీన డివిజన్లు, శివారుకాలనీల అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పాలకవర్గం పనిచేస్తుందని చెప్పారు. అన్ని డివిజన్లను సమాంతరంగా అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. రోడ్లు, డ్రైనేజీలతోపాటు ప్రతిరోజు ప్రజలకు మంచినీరందించే గొప్ప కార్యక్రమాన్ని నగర పాలక సంస్థ చేపడుతుందని చెప్పారు. పూర్వపు రాంనగర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఈ ప్రాంతంలో చాలా మేరకు అభివృద్ధి పనులు చేపట్టామని మేయర్ సునీల్‌రావు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో బీజేపీ నాయకుడు నాగ సముద్రం ప్రవీణ్‌కుమార్, డీఈ లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రామడుగు ఎస్ఐని సస్పెండ్ చేయాలి

సుభాష్‌నగర్, జూలై 4: ఎరుకల యువకుడిని లాకప్‌లో చిత్రహింసలకు గురిచేసిన రామడుగు ఎస్ఐని సస్పెండ్ చేయాలిన రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్, తెలంగాణ కుల సంఘాల జేఏసీ చైర్మన్ జీఎస్ ఆనంద్, హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడు మొగిలి సతీష్, ఎరుకల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు మొగిలి శ్రీనివాస్ కోరారు. గురువారం కలెక్టర్, పోలీస్ కమిషనర్‌లకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక మటన్ షాపు నిర్వాహకుడి ఒత్తిడి మేరకే ఎస్ఐ ఎరుకల కులస్తుడు కుతాడి కన కయ్యను చిత్రహింసలకు గురి చేశాడని ఆరోపిం చారు. రామడుగు పోలీస్ స్టేషన్‌లో తీవ్రంగా చిత్ర హింసలకు గురిచేసి కరీంనగర్ టాస్క్‌ఫోర్స్ కార్యాలయానికి తరలించారని ఆరోపించారు. ఎస్ఐతో పాటు మటన్ షాపు నిర్వాహకుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసులు నమోదు చేయాలన్నారు.

దొడ్డి కొమురయ్య పోరాటాన్ని ఆదర్శంగా తీసుకోవాలి



తెలంగాణ చౌక్ వద్ద దొడ్డి కొమురయ్యకు నివాళులర్పిస్తున్న నాయకులు

గణేశ్‌నగర్, జూలై4: దొడ్డి కొమురయ్య పోరాటాన్ని ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా కురుమ సంఘం మహిళ విభాగం అధ్యక్షురాలు కర్రె పావని అన్నారు. దొడ్డి కొమరయ్య వర్ధంతి సందర్భంగా గురువారం తెలంగాణ చౌక్‌లో ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కర్రె పావని మాట్లాడుతూ దొడ్డి కొమరయ్య జీవితం యావత్ సమాజానికి స్ఫూర్తిదాయకం అని అన్నారు. కార్యక్రమంలో కురుమ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బిర్ల బీరయ్య, కడారి అయిలయ్య, కురుమ సంఘం రాష్ట్రనాయకులు బిర్ల బీరయ్య, ఎల్లపెల్లి లచ్చయ్య, బిసి పూలే ఫోరం రాష్ట్ర నాయకులు గుంజపడుగు హరిప్రసాద్, గౌడ్ సంఘం రాష్ట్ర నాయకులు కలర్ సత్తన్న, పూదరి రాజేశ్వరి గౌడ్, యాదవ సంఘం రాష్ట్ర నాయకులు మేకల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

●భగత్‌నగర్: దొడ్డి కొమురయ్య వర్ధంతిని సీపీఐ నగర శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శికసిరెడ్డి సురేందర్ రెడ్డి, సీపీఐ రాష్ట్ర సభ్యులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, పైడిపల్లి రాజు, బోనగిరి మహేందర్, బ్రాహ్మణపల్లియుగేందర్, మచ్చ రమేష్ పాల్గొన్నారు.

●దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసు దేవరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం కోతిరాంపూర్‌లోని ముకుందలాల్ మిశ్రాభవన్‌లో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో వర్ణ వెంకటరెడ్డి, గీట్ల ముకుందరెడ్డి, గుడికందుల సత్యం, ఎడ్ల రమేష్, డినరేష్, జి తిరుపతి, పున్నం రవి, కాల్వ సురేష్, వరాల రవికుమార్ పాల్గొన్నారు.

● తిమ్మాపూర్ : మండలంలోని పర్లపల్లి గ్రామంలో దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా కురుమ యువ చైతన్య సమితి ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని సన్‌షైన్ అసుపత్రి వారి సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఆసుపత్రి వైద్యులు అపూర్వ, అసుపత్రి కో ఆర్డినేటర్ రావ రాజు, కురుమ యువ చైతన్య సమితి నాయకులు బాగోతుల తిరుపతి, వెంగల ఎల్లేష్ పాల్గొన్నారు. మండలంలోని నుస్తులాపూర్ ప్రాథమిక గొర్రెల పెంపకదారుల సహకార సంఘం అధ్యక్షులు తమ్మనవేణి అయిలయ్య యాదవ్ అధ్యక్షతన జరిగిన దొడ్డి కొమురయ్య వర్ధంతి కార్యక్రమంలో గొర్రెల మేకల పెంపకందార సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాల్వ సురేష్ పాల్గొని దొడ్డి కొమురయ్యకు నివాళులు అర్పించారు.

● గన్నేరువరం: దొడ్డి కొమురయ్య 78వ వర్ధంతిని పురష్కరించుకొని గొర్రెలు మేకలు పెంపకందారుల సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో దొడ్డి కొమురయ్య చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జీఎంపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు జీల ఎల్లయ్య, మండల అధ్యక్షుడు మీసం రాములు, నాయకులు శ్రీనివాస్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

● చొప్పదండి : చొప్పదండి కురుమ యువజన సంఘం ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య వర్ధంతిని జరుపుకున్నారు. ఈ సందర్భంగా కొమురయ్య చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు నెట్టు మునేష్, పెద్ది సంపత్, రాజన్నల రాజు, గుంటి రాజశేఖర్, గుంటి మల్లయ్య, వెంకటి, రాజన్నల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్ విజయవంతం



జమ్మికుంటలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో నాయకులు

హుజూరాబాద్, జూలై 4: నీట్ పరీక్షల ప్రశ్నపేపర్లు లీకేజీలను నిరసిస్తూ వామపక్ష విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా విద్యాసంస్థలకు బంద్‌ను పిలుపునివ్వగా గురువారం విజయవంతమైంది. ఈ సందర్భంగా విద్యాసంస్థల యాజమాన్యాలు స్కూళ్లు, కాలేజీలను స్వచ్ఛందంగా బంద్ చేశారు. అనంతరం వామపక్ష నాయకులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 24లక్షల మంది రాసిన నీట్ పేపర్ లీకేజీ ఘటనకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, రామే, అభిలాష్, ఇమ్రాన్, నరేష్, రవితేజ, రోహిత్, రాహుల్, సన్నీ, నాగా, సందీప్, కార్తీక్, నితిన్, వంశబూ, రంజిత్, సందీప్, సోహెల్ తదితరులు పాల్గొన్నారు.

● హుజూరాబాద్‌రూరల్ : విద్యా సంస్థల బంద్ పిలుపు మేరకు సింగాపూర్ గ్రామంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలను తెలంగాణ యువజన సమితి, తెలంగాణ విద్యార్థి జన సమితి నాయకులు బంద్ చేయించారు. కార్యక్రమంలో టీవైజేఎస్ రాష్ట్ర కార్యదర్శి మోరే గణేష్, పల్లెర శ్రీనివాస్, దాసారపు శివ తదితరులు ఉన్నారు.

● జమ్మికుంట : నీట్ పరీక్ష ప్రశ్నాపత్రాల లీకేజీని నిరసిస్తూ వామపక్ష విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో ఇచ్చిన దేశవ్యాప్త విద్యా సంస్థల బంద్‌లో భాగంగా జమ్మికుంటలో గురువారం బంద్ విజయవంతమైంది. విద్యార్థి సంఘాల నాయ కులు మాట్లాడుతూ నీట్, నెట్ పరీక్ష పేపర్ల లీకేజీ వల్ల నష్టపోయి ఆందోళన చెందుతున్న విద్యార్థులకు, తల్లిదండ్రులకు పూర్తి స్థాయి భరోసా కల్పించడంలో కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం విఫలం అయిందన్నారు. దేశవ్యాప్తంగా 24లక్షల మంది రాసిన నీట్ పరీక్ష పేపర్ లీకేజ్ ఘటనకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యూ నాయకులు ఎండి ఇమ్రాన్, రామారపు వెంకటేష్, కేశబోయిన రాము, పొడిశెట్టి అభిలాష్, గాలిబ్ నరేష్ పాల్గొన్నారు.

● గంగాధర : విద్యార్థి సంఘాల పిలుపు మేరకు గురువారం నిర్వహించిన విద్యా సంస్థల బంద్ సంపూర్ణంగా సాగింది. ఎన్ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు తాల్ల దిలీప్ గంగాధరలో మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతుందని, నీట్ పేపర్ లీకేజీ కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే జరిగిందన్నారు.ఈసందర్భంగా ప్రభుత్వం, ప్రవేటు విద్యాసంస్థలు బంద్‌లో పాల్గొన్నాయి.

విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ

భగత్‌నగర్, జూలై 4: కొత్తపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల ఒడ్డెర కాలనీ విద్యార్థులకు కెఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ కొండపల్లి వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో స్కూల్ యూనిఫామ్ అందించారు. ప్రభుత్వ ప్రాథమిక ఒడ్డెర కాలనీకి చెందిన 30మంది విద్యార్థు లకు స్కూల్ యూనిఫామ్స్ అందించారు. ఈసందర్భంగా పాఠశాల ఉపాధ్యాయురాలు పులి పద్మ ధన్యవాదాలు తెలిపారు.

సామాజిక కార్యకర్తకు అవార్డు

భగత్‌నగర్, జూలై 4: కొత్తపల్లి పట్టణానికి చెందిన ప్రముఖ సామాజిక సేవా కార్యకర్త లియోమల్టిపుల్ కౌన్సిల్ సభ్యుడు జేరిపోతుల వాసు, గోనె పవన్‌కళ్యాణ్‌లు లియో మల్టిపుల్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలు మాట్లాడుతూ సమాజానికి తమ వంతుగా ఏదైనా చేయాలనే తపనతోనే కొన్నేళ్లుగా సామాజిక సేవా రంగంలో నిలిచామన్నారు. తమ సేవలను గుర్తించి లియో మల్టిపుల్ క్లబ్ నిర్వాహకులు తమకు అవార్డు ప్రకటించా రన్నారు. అవార్డు రావడం పట్లహర్షం ప్రకటిస్తు క్లబ్ సభ్యులకు, కొత్తపల్లి పట్టణవాసులకు శుభాకాంక్షలు తెలిపారు.

మొక్కలు నాటిన బీజేపీ నాయకులు

భగత్‌నగర్, జూలై4: ఏక్ పేడ్ మాకే నామ్ అమ్మపేరుతో ఒక మొక్కను రేకుర్తి 18వ డివిజన్‌లో బీజేపీ శక్తి కేంద్రం ఇన్‌ఛార్జి జాడి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా చేపట్టిన కార్యక్రమంలో భాగంగా రేకుర్తి ఐ హాస్పిటల్ బైపాస్ రోడ్డు డివైడర్ మధ్యలో మొక్కలు నాటారు. ఈకార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధికార ప్రతినిధి గోదారి నరేష్, జాడి కౌసల్య, నాగుల వెంకటేష్‌గౌడ్, సంజీవరెడ్డి, సాయి, మామిడిపల్లి వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడం కూల్చివేత

కరీంనగర్ టౌన్, జూలై 4: నగరంలోని సప్తగిరికాలనీలో అనుమతి లేకుండా నిర్మించిన ఓ ఫంక్షన్‌హాల్‌ను కూల్చివేశారు. అనుమతి లేకుండా నిర్మాణం చేయడం చట్ట విరుద్ధమంటూ మూడుసార్లు యజమానులకు నోటీసులు పంపించినా వారు స్పందించకపోవడంతో కూల్చివేసినట్లు నగరపాలక సంస్థ ఇన్‌చార్జి డిప్యూటీ సిటీ ప్లానర్ భానుచందర్ తెలిపారు. నగరపాలక సంస్థ కమిషనర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ ఆదేశాల మేరకు గురువారం అనుమతి లేకుండా నిర్మించిన ఫంక్షన్‌హాల్‌ను కూల్చివేశామని చెప్పారు. ఈకార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ అధికారి శ్రీహరి, టీపీఎస్ నవీన్, రాజ్‌కుమార్ పాల్గొన్నట్లు తెలిపారు.

ముందస్తు అరెస్టు

భగత్‌నగర్, జూలై 4: కరీంనగర్‌లో ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టుచేశారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బోనగిరి మహేందర్, కార్యదర్శి బ్రాహ్మణపల్లి యుగేందర్‌లను సీపీఐ కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవన్ వద్ద పోలీసులు అరెస్టు చేశారు.

రాహుల్‌గాంధీ దిష్టి బొమ్మ దహనం

భగత్‌నగర్, జూలై4: హిందువులపై రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా గురువారం కరీంగనర్-వేములవాడ రహదారి కమాన్‌పూర్ వద్ద బీజేపీ నాయకులు ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈకార్యక్రమంలో బీజేపీ కొత్తపల్లి మండల శాఖ అధ్యక్షుడు రతన్‌కుమార్, మండల ప్రధాన కార్యదర్శి కోమటిరెడ్డి అంజనీకుమార్, జవ్వాజిరమేష్, కట్ల సుమలత, నలువాల మహేష్, బీజేవైఎం అధ్యక్షుడు యువ ప్రశాంత్ పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు

భగత్‌నగర్, జూలై 4: కొత్తపల్లి మండలం మల్కాపూర్ ప్రాథమిక, ఎస్సీకాలని, లక్ష్మీపూర్ ప్రాథమికపాఠశాల విద్యార్థులకు రాజరాజేశ్వరి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించారు. రేకుర్తి కంటి ఆసుపత్రి సహకారంతో 102 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన ముగ్గురిని రేకుర్తి కంటి ఆసుపత్రికి రెఫర్ చేశారు. ఈకార్యక్రమంలో రాజరాజేశ్వరి క్లబ్ కార్యదర్శి నరహరి లక్ష్మారెడ్డి, టెక్నీషియన్స్ సయ్యద్ షమ్మద్దీన్, సల్మా, స్కూల్ ఐ క్యాంప్స్ కో-ఆర్డినేటర్‌గుండోజు లక్ష్మ, ప్రధానోపాధ్యాయులు పద్మావతి, సుజాత పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్యను పెంచాలి : డీఈవో

మానకొండూర్, జూలై 4: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని జిల్లా విద్యాధికారి జనార్ధన్‌రావు ఉపాధ్యాయులను ఆదేశించారు. మానకొండూర్‌లోని ఎమ్మార్సీ ప్రాథమిక పాఠశాలను గురువారం తనిఖీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. మండల విద్యాధికారి ఎం. మధుసుధనాచారి, ఉపాధ్యాయులు ఉన్నారు.

హుజూరాబాద్ బస్టాండ్‌లో కళాజాతా

హుజూరాబాద్, జూలై 4: హుజూరాబాద్ బస్టాండ్, డిపోలలో కళాకారులు గురువారం ఆట, పాటలతో ప్రయాణికులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఇన్‌చార్జీ డీఎం సీహెచ్ వెంకటేశ్వర్లు, ఎం కమల, సారయ్య, వీవీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు ఇసుక వేలం

గన్నేరువరం, జులై 4: మండల కేంద్రం శివారులోని పలుగురాళ్ల వద్ద అక్రమంగా నిలువ చేసిన పది ట్రిప్పుల ఇసుకను ప్రభుత్వ నిబంధనల మేరకు స్వాధీనం చేసుకొని శనివారం వేలం పాటను నిర్వహించనున్నట్లు తహశీల్దారు భిక్షపతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

శంకరపట్నం, జూలై 4: శంకరపట్నం మండలం కన్నాపూర్ గ్రామానికి చెందిన ఓ రైతుకు చెందిన పత్తి పంటను నష్టం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని బాధితుడు అడితం అయిలయ్య పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. బుధవారం రాత్రి అదే గ్రామానికి చెందిన నాయిని మల్లయ్య, నాయిని వెంకటేష్ అనే వ్యక్తులు సుమారు 10గుంటల మేర పత్తి మొలకలు పీకేశారని పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

కాంట్రాక్టర్‌పై చర్య తీసుకోవాలి

చిగురుమామిడి,జూలై 4: మండలంలోని గాగిరెడ్డిపల్లి-ఇందుర్తి గ్రామాల మధ్యలో ఏర్పాటు చేస్తున్న డబుల్ రోడ్డు పనులు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని అతనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని గురువారం నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ అధికారి కృష్ణారెడ్డికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. పనులు నత్తనడక సాగడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చర్య తీసుకోవాలని కోరారు.

రైతు భరోసాకు సలహాలు

సైదాపూర్, జూలై 4: మండలంలోని వెన్నంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో గురువారం ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వసభ్య సమావేశం నిర్వహించి రైతు భరోసాపై రైతుల సలహాలు, సూచనలు తీసుకున్నారు. చైర్మన్ బిల్లా వెంకట్‌రెడ్డి, ఏఈవో రజిత, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలపై విచారణ

హుజూరాబాద్‌రూరల్, జూలై 4 : పెద్దపాపయ్యపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని వరంగల్ రోడ్డు పక్కన నిర్మిస్తున్న అక్రమ కట్టడాలపై యువజన కాంగ్రెస్ నాయకుడు టేకుల శ్రావన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం డివిజనల్ పంచాయతీ అధికారి శ్రీనివాస్ విచారణ చేశారు. నివేదికను కలెక్టర్‌కు అందించనున్నట్లు తెలిపారు.